
''సరే! మీ పెద్దలతో మాట్లాడాలి. తీసుకురండి'' అన్నది మా అమ్మ.
''వెంటనే కుదరదు. ముందు మా ఊరు తీసుకెళ్లి, ఓ పదిహేను రోజులు ఉన్నాక.. మా వాళ్లను ఒప్పించి చేసుకుంటాను'' అన్నాడతను.
మా అమ్మ పదిహేను రోజులకు ముందుగా ఎంతివ్వాలో మాట్లాడి, ఆ మొత్తం తీసుకుని.. ఆయనతో సుజాతను, ఆమె తమ్ముణ్ని సాయమిచ్చి పంపింది. శ్యామలరావు బాగా డబ్బున్నవాడు కావడంతో.. సుజాతను పెళ్లి చేసుకుంటే ఆమె బతుకు సాఫీగా సాగిపోతుందని మా అమ్మ మాతో అన్నది. అయితే పదిరోజులకే సుజాత తన తమ్ముణ్ని వెంటబెట్టుకుని తిరిగొచ్చేసింది. శ్యామలరావు సుజాతను తమ ఇంటికి తీసుకుపోకుండా, తమ పొలంలోని చిన్న గెస్ట్‌హౌస్‌లాంటి ఇంట్లో ఉంచాడు.
''అదేంటి? మీ ఇంటికి తీసుకెళ్లలేదేం!?'' అని అడిగితే..
''నాలుగు రోజులు పోనీ!'' అన్నాడు.
ఓ పదిరోజులు పోయేక..



''నీ గుణం మంచిది కాదు''.. అంటూ తిట్టి కొట్టబోయాడు.
తమ్ముడు అడ్డుపడ్డాడు.
''కొండలరావు మొన్న నీ దగ్గరికి వచ్చాడట కదా'' అన్నాడు కోపంగా శ్యామలరావు.
''అవును వచ్చాడు. 'నేను శ్యామ్‌గారి ఇలాకాలో ఉన్నాను. మరే మగాణ్నీ కన్నెత్తి చూడను!' అని చెప్పాను. వెళ్లిపోయాడు'' చెప్పింది సుజాత.
''నేను నీ మాటలు నమ్మను. ఇక బయల్దేరు..'' అంటూ సవారీ బండి ఎక్కించి పంపేశాడు.
దారిలో ఆ బండతను చెప్పిన కబుర్ల వల్ల తెలిసింది.. తన మావగారు ఇస్తానన్న కట్నం పూర్తిగా ఇవ్వకపోవడంతో పెళ్లాన్ని పుట్టింటికి పంపేశాడట. సుజాతను తెచ్చుకుని ఉంచుకున్నాడని తెలిసి, మావగారు అప్పోసప్పో చేసి మిగతా కట్నం డబ్బుతోపాటు కూతుర్ని నిన్ననే పంపేడట. సుజాతను అక్కడికి తీసుకెళ్లడం కూడా మావగారిని పరోక్షంగా బెదిరించడానికేనట.. సుజాత కాస్త బాధపడుతూ విషయమంతా చెప్పుకొచ్చింది.
సుజాత అనుభవం తెలిశాక నాకు కొన్ని విషయాలు అర్థమయ్యాయి. ముఖ్యంగా శ్యామలరావు భార్యను తలచుకునేకొద్దీ ఆమె మీద అదోరకం అభిప్రాయం ఏర్పడింది. వ్యక్తిత్వాలు లేని ఆమెలాంటివాళ్లు ఎంతమంది ఉన్నారో అనిపించింది. వాళ్లకులేని వ్యక్తిత్వం మాలోనే నయం అనిపించింది. మేమెవరికీ బానిసలుగా మసలుకోవడం లేదు. మేం ఇతరులకు సుఖమిస్తాం. అందుకు తగిన ప్రతిఫలం తీసుకుంటాం.
ఈ మధ్య సుజాతను 'సుడిగాలి' నాటకానికి ఎవరో వచ్చి బుక్ చేసుకున్నారు. ప్రతివారం ఆమె రిహార్సల్స్‌కు వెళ్లి వస్తున్నది. ఖాళీ సమయాల్లో తన పోర్షన్ చదువుకుంటున్నది. నాలుగు రోజుల క్రితమే ఏదో పరిషత్ పోటీల్లో 'సుడిగాలి' ప్రదర్శించారు. సుజాతకు ఉత్తమ నటిగా బహుమతి కూడా వచ్చింది. ఇప్పుడు ఆమె సంతోషంగా ఉంది. మర్నాడు పొద్దున లేవగానే.. ముఖాలు కడుక్కుని టిఫిన్ తిని, కాఫీ తాగాం. మాకు పొద్దున అంటే తొమ్మిదో పదో.. అన్నట్టు చాలామంది జర్నలిస్టులకూ మాలాగే రాత్రి డ్యూటీలట కదా! ఈ మధ్య ఓ జర్నలిస్టు ఏవో మాటల్లో నాతో అన్నాడు.

* * *

''ఇప్పుడు నాక్కొంచెం అనుమానంగా ఉంది. రాత్రి వచ్చినవాడు అంటించి పోయేడేమో నని'' భయపడుతూనే చెప్పింది విజయ.
''ఇవి మామూలే కదా! మన ఆర్ఎంపీకి చూపించుకుంటే సరి'' చెప్పాను.
అప్పుడు నాకు మూర్తిగారు గుర్తుకొచ్చారు. శాన్నాళ్లయ్యింది ఇక్కడికొచ్చి. నిజానికి ఆయన చాలాసార్లు కళ్లముందు కదులుతారు. రోగాల గురించి ఒకనాడు ఏదో రష్యా నవల గురించి చెప్పారు. అది తెలుగులో 'యమకూపం' అట. అందులో జెన్నీ అనే ఆమెకు మగాళ్ల మీద చాలా కోపం ఉండేదట. వాళ్ల కారణంగానే తాను ఈ వృత్తిలోకి రావాల్సి వచ్చిందని ఆమె పగ. జెన్నీ పనిచేసే కంపెనీకి ప్రతివారం ప్రభుత్వ డాక్టర్ వచ్చి, పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తాడు. వందలేళ్ల క్రితమే ఆ దేశంలోని ఆ ప్రాంతంలో వ్యభిచారాన్ని చట్టబద్ధం చేశారట. జెన్నీ మాత్రం డాక్టర్ వచ్చే టైముకు ఎలానో తప్పించుకునేది. ఒక్కోసారి మిద్దెమీదకెళ్లి దాక్కునేది. అలా ఎందుకు చేసేదంటే.. తన దగ్గరికొచ్చే ప్రతి మగాడికీ తన వ్యాధిని అంటించెయ్యాలి. అప్పుడుగానీ తన కసి తీరదు.
మూర్తిగారు వస్తే బావుండును. ఆయనంటే మొదట్లో గౌరవం ఏర్పడింది. తర్వాత ఇష్టం కలిగింది. తన గురించి ఆలోచిస్తుంటే ఎవరో వచ్చాడు. బాగానే ఉన్నాడు. మేం కూడా వచ్చిన వాళ్లు ఎలా ఉన్నారో అని చూస్తాం. కాస్త శుభ్రంగా ఉండేవాళ్లతో గడపడానికి చిరాకుగా ఉండదు కదా!? నన్ను కౌగలించుకుంటూ ఏవో కబుర్లలోకి దిగాడు. అతని పేరు చక్రధర్ అట.
ఏం చేస్తుంటారని అడిగితే.. ఏదో కంపెనీలో ఫిట్టర్‌గా పని చేస్తున్నానని చెప్పాడు.
''మీరు కళావంతులైతే.. మేం కుమ్మరోళ్లం! మా తాత, నాన్న కుండలు, దాకలు, కూజాలు వంటివి చేసేవారు. నేనూ చిన్నప్పుడు అలాంటిదేదో ఒకటి చేయడానికి సరదా పడేవాణ్ని. ముఖ్యంగా కుమ్మరి చక్రం తిరుగుతుంటే నాకు భలే తమాషాగా ఉండేది..'' అని చెబుతుంటే 'భోళామనిషిలా ఉన్నాడే!' అనుకుంటూ, వినడానికి ఉత్సాహం చూపిస్తూ ప్రోత్సహించాను.
''మా తాత, నాన్న వినాయకుడిలాంటి మట్టిబొమ్మలు కూడా చేసేవారు తెలుసా!? నాకూ కొద్దిగా వచ్చేది. నన్ను వాటికి రంగులు వేయమనేవారు. ముందుగా వాళ్లు వేసి చూపించేవారు. డబ్బులూ, ఏడాదికోసారి ధాన్యం బాగా వచ్చేవి. మా పెనుమళ్లలో బోర్డు స్కూలు ఉండటంతో నన్నూ పంపేవారు. 'ఎందుకురా మనకు సదువులు!? సక్కగా మన పని నేర్చుకుంటే బాగుంటది' అన్నాడు మా తాత మొదట్లో. తర్వాత జరుగుతున్న మార్పులు చూసి, మిన్నకుండిపోయాడు. కుండలు, దాకలు వాడకం తగ్గడం మొదలైంది. సీవెండి, స్టీలు బిందెలు రావడంతో అందరూ వాటినే కొనడం ప్రారంభించారు'' అంటూ నా పైట పట్టుకున్నాడు.
''అర్జంటుగా వెళ్లిపోవాలా!? లేటయినా ఫర్వాలేదా'' అన్నాను అతని వంక నవ్వుతూ చూస్తూ.
''అర్జంటేమీ లేదు.. '' అంటూ ముద్దుపెట్టుకున్నాడు.
''మీరు మీ గురించి చెబుతుంటే ఇంటరెస్టుగా ఉంది. చెప్పండి''.
''స్కూలు ఫైనల్ అయ్యాక.. కాకినాడలో ఐటీఐ చదివాను. బీసీలం కదా.. సీటు సులువుగానే వచ్చింది. స్కాలర్‌షిప్ కూడా ఇచ్చారు. అదయ్యాక కొంతకాలం ఖాళీగా ఉన్నాను. ఓ ఏడాదికి ఫిట్టర్ ఉద్యోగం వచ్చింది. నువ్వూ చదువుకున్నదానిలా కన్పిస్తున్నావ్'' అన్నాడతను నా వంక చూస్తూ.
''టెన్త్ దాకా చదువుకున్నాను. నేనూ స్కూలు ఫైనల్ చదివి ఉండేదాన్ని. కళావంతులం కదా! అప్పటికే పెద్ద మనిషిన్నై పోవడంతో వృత్తిలోకి దించేసింది మా అమ్మ. మీకు పెళ్లయిందా!?''.
''లేదు. సంబంధాలు చూస్తున్నారు మా అమ్మానాన్నా. మా చుట్టాల పిల్లను ఎవర్తినో ఖాయం చేస్తారు. రెండేళ్ల క్రితమే నాకు పెళ్లి చేద్దామనుకున్నారు. అయితే, కాస్త కుదుటపడ్డాక.. అంటే మా అమ్మానాన్నలను కూడా నా దగ్గర ఉంచుకోడానికి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆగాను. ఎప్పుడన్నా ఒళ్లు ఊరుకోకుంటే ఇలా వస్తాను. అదీ పెళ్లయ్యేదాకానే'' అంటూ సరసంలో పడ్డాడు.
అతను వెళ్లిపోయాక నేను ఆలోచనలో పడ్డాను. పేరు చక్రధర్ అట. అదీ వృత్తిపరంగానే పెట్టి ఉంటారా. చక్రధారి వాళ్ల వృత్తివాడే కదా!? అవునో కాదో .. ఏవో అలా ఆలోచిస్తూ నడుం వాల్చాను. రోజురోజుకూ రోజులు ఒకేలా ఉండటం లేదు. కమ్మరి, చేనేత, మంగలి.. ఇలా

**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.**